క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం నిర్వహించారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు నేతృత్వంలో జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్ యాదవ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్, అశోక్‌కుమార్, బంగార్రాజు, కర్రి రాజేష్, సాయికృష్ణ, జాన్, నానాజీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

కమిషనర్ బదిలీపై పునరాలోచించాలి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా బదిలీ చేయడంలో ఆంతర్యమేమిటని, కమిషనర్ బదిలీపై పునరాలోచించాలని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి 6 నెలలు పూర్తి కాకుండానే బదిలీ చేయడం, ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడం బాధాకరమన్నారు. ఆర్థిక రాజధాని విశాఖ అని పేర్కొంటున్న ప్రభుత్వం 6 నెలలు పూర్తి కాకుండా, మహానగర సమస్యలు ఒక్కొక్కటీ పరిష్కరిస్తూ, ఓ అవగాహనకు వస్తున్న తరుణంలో బదిలీ చేయడం శోచనీయమన్నారు. ఉద్యోగులకు సంబంధించి కారుణ్య నియామకాలు, పదోన్నతుల వంటి వాటిపై సానుకూలంగా వ్యవహరిస్తూ, చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల్లో కొన్నింటిని పరిష్కరించి, మరికొన్ని పరిష్కార దశలో ఉన్న ఈ సందర్భంలో బదిలీ చేయడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. విశాఖ నగరానికి సంపత్‌కుమార్ సేవలు అందించే అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అత్యుత్తమ ప్రతిభతో ఒలింపియాడ్‌కు ఎంపిక



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆకాష్ విద్యా సంస్థల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఆకాష్ ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్ ప్రోగ్రామ్ ద్వారా అన్ని సబ్జెక్టుల్లో తర్ఫీదు పొందే కార్యక్రమం ప్రారంభించినట్టు ఆకాష్ విద్యా సంస్థల స్టేట్ అకడమిక్ హెడ్ జీఆర్‌వీఎస్ఎన్ మూర్తి, రీజినల్ సేల్స్ గ్రోత్ హెడ్ నిశాంత్ మిశ్రా తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 25న తమ కేంద్రాల్లో పోటీ పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇటీవల మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించిన నగరానికి చెందిన 22 మంది విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. నేషనల్ పీఆర్ హెడ్ వరుణ్ సోనీ, అసిస్టెంట్ డైరెక్టర్ వై. లక్ష్మీనారాయణ, బ్రాంచ్ మేనేజర్ జి. రాజేశ్వరరావు, గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాధర్‌కు స్వర్ణ కంకణం

డాబాగార్డెన్స్: యోగాలో 18 ఏళ్లుగా విశేషంగా కృషి చేస్తున్న నగరానికి చెందిన వేల్పుల కనక వెంకటేశ్వర కృష్ణ కళాధర్‌రావుకు శ్రీ ఆర్యాణి సకల కళా సేవా సంస్థ, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ సంయుక్తంగా జాతీయ పురస్కారాన్ని అందజేశాయి. కరీంనగర్ ఫిలిం భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు దూడపాడ శ్రీధర్ కళాధరరావుకు స్వర్ణ కంకణం తొడిగారు. యోగా అధ్యాపకునిగా వ్యవహరిస్తున్న కళాధర్ స్నేహితుడు పెదిరెడ్ల కనకారావు ప్రోత్సాహంతోనే తాను యోగాలో ప్రవేశించినట్టు తెలిపారు.

కానరాని.. క్రీడా మైదానాలు

పిల్లలు చదవాలి.. ఆడాలి. అప్పుడే వారు విద్యా పరంగా.. ఆరోగ్య పరంగా ఫిట్‌గా ఉంటారు. అయితే ఆటలకు దోహదపడే క్రీడా మైదానాలు దక్షిణలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కడా కానరావడంలేదు. ఆటలాడే ఆసక్తి గల పిల్లలు బడి బయట ఎక్కడో తోచిన చోట ఆడుకుంటున్నారు. క్రీడలతోనే మానసికోల్లాసం.. చదువులతో పాటు క్రీడలూ ముఖ్యమే అని ప్రత్యేక కార్యక్రమాల్లో ఉపన్యాసాలిచ్చే రాజకీయ పెద్దలు, నాయకులు దక్షిణలో క్రీడా మైదానాలు లేని పాఠశాలల దురవస్థపై ఇప్పటికైనా దృష్టి సారిస్తే పరిస్థితి మారుతుందని ఇటు విద్యార్థులు.. అటు వారి తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- ఆరోగ్యం.. శరీర సౌష్టవంపై ప్రభావం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు.. అధికారులు



పాత పోస్టాఫీస్‌లోని ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాలలో రాళ్లు తేలిన మైదానం





దండుబజార్ ఎంవీడీ పాఠశాల ప్లే గ్రౌండ్‌లోనే సిబ్బంది వాహనాలు

డాబాగార్డెన్స్: ఏ పాఠశాలలో ఏ కార్యక్రమం జరిగినా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథులు చెప్పే తొలి మాట క్రీడలతో మానసికోల్లాసం. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని. మరి ఎన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడా మైదానాలున్నాయి. దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఆడుకునేందుకు ఆటస్థలాలను వేళ్లపై లెక్క పెట్టవచ్చు. కనీసం ఉన్నత పాఠశాలల్లో సైతం క్రీడా వసతులు లేవు. కొన్ని ప్రైవేట్ స్కూళ్లకు తరగతి గదులపై ఉన్న దృష్టి.. ఆట స్థలాలపై లేదు.

మైదానాలు కరవు..

నియోజకవర్గంలోని విద్యార్థులకు మైదానాలు కరవయ్యాయి. దాదాపు ఏ పాఠశాలలోనూ సరైన ఆటస్థలాలు లేవు. అక్కడక్కడ ఉన్నా అవి గోతులు, రాళ్లతో దర్శనమిస్తున్నాయి. దీంతో ఆటలపై మక్కువ ఉన్నవారు ఆరుబయట తుప్పలు, డొంకలు ఉన్న ప్రాంతాల్లో ఆడుకుంటున్నారు. లేదంటే కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు తగిన ప్రాధాన్యత **ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠ్యాంశాలకు ఇస్తున్న ప్రాధాన్యత క్రీడలకు కల్పించడం లేదు. వివిధ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడం తప్ప విద్యార్థులకు ఆటలు, క్రీడల్లో శిక్షణ ఇచ్చే పరిస్థితి కనపడడం లేదు.**

నియోజకవర్గ పరిధిలో అరకొరగానే..

దక్షిణలోని 29వ వార్డులో గల జీవీఎంసీ ప్రకాశరావుపేట, దండుబజార్ ఎంవీడీ హైస్కూల్లో క్రీడా ప్రాంగణాలు లేవు. అలాగే శ్రీరంగపురం ప్రైమరీ పాఠశాల, దండుబజార్ ప్రైమరీ పాఠశాలలోను **క్రీడా మైదానాలు** లేవు. 30వ వార్డులో అచ్యుత **రామ ప్రాథమిక పాఠ**శాల, 36వ వార్డులో కొత్త **సాలిపేట, రంగిరీజు**వీధి ప్రైమరీ పాఠశాలలు, **37వ వార్డులో రెల్లివీ**ధి, చెంగల్రావుపేట ప్రైమరీ పాఠశాలల్లో మచ్చుకైనా ఆటస్థలాలు కానరావు. 38వ వార్డులో శ్రీరామ ప్రైమరీ పాఠశాల, శివాలయం వీధిలో గల ప్రైమరీ పాఠశాల, 39వ వార్డులో ఎంవీడీఎం హైస్కూల్‌కు మైదానం ఉన్నప్పటికీ అసౌకర్యంగా ఉన్నాయి. ఇదే వార్డులో ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలలో ఉన్న మైదానం ఆడుకునేందుకు వీలుగా లేదు. అలాగే పోర్టు బేసిక్, పోర్టు ఉర్దూ బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాల, గూడే వారి వీధి ప్రైమరీ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. ఇక 35వ వార్డులో న్యూమార్కెట్ వార్డు, ఓల్డ్ మార్కెట్ వార్డుల్లో గల ప్రైమరీ పాఠశాల, ప్రసాద్ గార్డెన్స్‌లో గల గణేష్ జీవీఎంసీ పాఠశాలలు, 31వ వార్డులో రమాదేవి భానోజీరావు మున్సిపల్ (ఆర్‌బీఎం) పాఠశాల, 32వ వార్డు అల్లిపురంలో మోడల్ స్కూల్, న్యూస్కూల్, 34వ వార్డులో అచ్చియ్యమ్మపేట పాఠశాలల్లో కూడా ఆటస్థలాలు లేవు. దీనిపై ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఆయా ప్రాంతాల నాయకులు, అధికారులు దృష్టి పెడితే పరిస్థితి మెరుగు కావచ్చు.



ప్లే గ్రౌండ్ లేని జీవీఎంసీ-ప్రకాశరావుపేట ఉన్నత పాఠశాల



లక్ష్మీ టాకీస్ ఎంవీడీఎం ఉన్నత పాఠశాలలో రాళ్లు తేలిన ఆటస్థలం

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు



అన్నప్రసాదం వడ్డిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

డాబాగార్డెన్స్: నిస్వార్థ సేవలే గుర్తింపునిస్తాయని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో భాగంగా మంగళవారం సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు.. బంధువుల కన్నా సంస్థ అన్ని విధాల ఆప్యాయంగా చూసుకుంటుందని పలువురు వృద్ధులు సీపీకి తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు చేదోడు, వాదోడుగా నిస్వార్థ సేవలు అందివ్వడం గొప్ప విషయమన్నారు. విశాఖను నేర రహిత నగరంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్టు తెలిపారు. సంస్థ ట్యూషన్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ప్లాంక్స్, సంస్థ మహిళా సభ్యులకు చిత్ర పటాలను సీపీ అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు రమణమూర్తి, సంస్థ సభ్యుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, వన్‌టౌన్ సీఐ జి. దేముడుబాబు, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, గౌరవ సభ్యుడు చింతపల్లి పోతురాజు, పశుపతి, మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి, సుజాత, రత్న, రాణి, ధనలక్ష్మి, ట్యూషన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహానికి అభాగ్యులు



షెల్టర్ హోంలో అభాగ్యులు

సీతమ్మధార: రైల్వేస్టేషన్ దగ్గర భిక్షాటన చేస్తున్న జెర్రిపోతు చంటి (35), బళ్లారి గంగమ్మ (60)లను ఏయూటీడీ సిబ్బంది షెల్టర్ హోంకు తరలించారు. రైల్వే పోలీసుల సమాచారంతో ఈ చర్యలు తీసుకున్నారు. చంటిది యలమంచిలి అని, గంగమ్మది శ్రీకాకుళంలోని పైడిభీమవరం అని తెలిపారు. మతిమరుపు వల్ల మరే వివరాలు బాధితులు చెప్పలేకపోతున్నట్లు తెలిపారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ప్రథమ సోషలిస్ట్ విప్లవ సారథి లెనిన్



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రాఘవేంద్రరావు

డాబాగార్డెన్స్: ఆకలి, పేదరికం, మతం, జాతి, వర్ణ అసమానతలు లేని దోపిడీ రహిత సోషలిస్ట్ విప్లవాన్ని రష్యాలో సాధించిన వీఐ లెనిన్ ప్రపంచానికే గొప్ప నాయకుడని సీపీఐ సీనియర్ నాయకుడు చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. లెనిన్ 101వ వర్ధంతి మంగళవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. మార్క్సిజాన్ని రష్యా దేశ పరిస్థితులకు అన్వయించి విజయం సాధించిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. 1871 ప్యారిస్ విప్లవ గుణ పాఠాల నుంచి మార్క్సిజాన్ని అభివృద్ధి చేసి చూపించారన్నారు. ఆయన మార్గంలో కమ్యూనిస్టులు నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పని చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్‌కే రహ్మాన్, పి. చంద్రశేఖర్, ఎం. మన్మథరావు, జి. రాంబాబు, సీఎన్ క్షేత్రపాల్, కె. వనజాక్షి, దేముడమ్మ, పి. పద్మ, నాగభూషణం, అప్పన్న, పైల ఈశ్వరరావు, అచ్యుతరావు, వై. రాంబాబు, కాసులరెడ్డి, నారాయణరావు, ఆదినారాయణ, శ్రీనివాసరావు, నల్లయ్య, నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌కు రెండు బ్యాటరీ కార్లు



కార్ల తాళాలు విమ్స్ డైరెక్టర్‌కు అందజేస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఉన్న రెండు బ్యాటరీ కార్లను విమ్స్‌కు అప్పగించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సహకారంతో మొత్తం ఆరు బ్యాటరీ కార్లు కొనుగోలు చేసి కేజీహెచ్‌కు అప్పగించారు. వాటిలో రెండింటి తాళాలను మంగళవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబుకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అందజేశారు.

నూతన కార్యవర్గం

డాబాగార్డెన్స్: సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బాప్టిస్ట్ సంఘాల మహాసభ ఈ నెల 10, 11, 12 తేదీల్లో కాకినాడ బ్యాంక్ పేటలో నిర్వహించగా.. సీబీసీఎన్‌సీ 70వ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగరంలోని చెంగల్రావుపేటలో గల క్రైస్ట్ చర్చి బాప్టిస్ట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నూతన కార్యవర్గం వివరాలు విలేకరులకు తెలిపారు. అధ్యక్షుడిగా డాక్టర్ విజయకుమార్, గౌరవ అధ్యక్షుడిగా పీసీహెచ్ అప్పారావు, కార్యదర్శిగా డాక్టర్ జి. జోసెఫ్‌రాజు, కోశాధికారిగా బీజేపీ ప్రసాద్, యూత్ జనరల్ సెక్రటరీగా డాక్టర్ పి. ఇమ్మానుయేల్‌తో పాటు పలు బోర్డులకు చైర్మన్లు, కార్యదర్శులు, ఎలెక్టెడ్ మెంబర్లు, అడ్వైజర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం 2025-2030 వరకు పని చేస్తుందని నూతన అధ్యక్షుడు డాక్టర్ విజయకుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట నుంచి కృష్ణా జిల్లా అవనిగడ్డ వరకు ఉన్న బాప్టిస్ట్ సంఘాల మధ్య ఐక్యత, ఆస్తుల పరిరక్షణ, క్రైస్తవ వేదాంత విద్య, వైద్యం, విద్యా సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.



సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గం

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు



జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్: మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) జి. ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక ఏవీఎన్ కళాశాలలో జరిగిన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో ఆయన మాట్లాడారు. నెహ్రూ యువ కేంద్రం, జేసీఐ, ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తన ప్రాణాన్ని కాపాడుకుంటూ, ఎదుటి వారి ప్రాణాలు కూడా రక్షించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు రక్షించిన వారికి ప్రభుత్వం రూ.5 వేల నగదు పురస్కారం అందిస్తుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ విభాగం అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత జాగ్రత్తలు పాటించడం అవసరమన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు, హరి వెంకటరమణ, జేసీఐ ప్రతినిధి శ్రావణ సంధ్య, జి. మహేశ్వరరావు, లీలా ప్రసాద్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, వైస్ ప్రిన్సిపాల్ పి. కృష్ణకుమారి, అధ్యాపక బృందం హైమావతి, డాక్టర్ రామ్‌కుమార్, వి. స్రవంతి, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ పరస

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు కుమ్మరవీధిలో వెలసిన బహుముఖ రూపాల పోలమాంబ 67వ పరస మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, జలాభిషేకం, పసుపు కుంకుమ పూజలు జరిపారు. సాయంత్రం 5 గంటల నుంచి పురవీధుల గుండా ఘటాభిషేకం ఉత్సవం, 6 గంటలకు నిప్పుల గుండం, పలు సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని పౌరాణిక వేషధారణలు, సాముగారడీలు, దాసుళ్ల సందళ్లు, డీజే వాయిద్యాల హోరుతో పాటు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధంపై ముమ్మర ప్రచారం

డాబాగార్డెన్స్: నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ 38వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ హెచ్చరించారు. వార్డు పరిధి ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై వార్డు కార్యదర్శులతో కలిసి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్‌ను పట్టుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ అమ్మకాలు చేపట్టకూడదన్నారు. మత్స్యకారులు, చిరు వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదని సూచించారు. ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. మితిమీరి నిషేధిత ప్లాస్టిక్ ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి బదులు ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్న 38వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్

రవీంద్రకుమార్ సేవలు నిరుపమానం

కంచరపాలెం: జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం జ్ఞానాపురం విచారణ విశ్వాసిగా, కథోలిక గురువుగా 25 సంవత్సరాలు సేవలు అందించిన రెవరెండ్ ఫాదర్ డాక్టర్ అర్నెల్ ఈగల రవీంద్రకుమార్ రజిత జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ అగ్రపీఠం పరిపాలనాధికారి ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ పొలిమేర జయరావు పాల్గొని వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాదర్ రవీంద్ర ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ముందుగా వడిచర్లవీధి బాలయేసు ముఖద్వారం నుండి సెయింట్ పీటర్స్ చర్చి వరకు పురప్రదక్షిణ చేసి, దివ్యబలి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానాపురం విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, ఆలిండియా క్యాథలిక్ యూనియన్ జాతీయ కార్యదర్శి బూరర వీంద్ర శేషుబాబు, పీపీసీ అధ్యక్షుడు రాజేష్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 200 మంది సహాయ విచారణకర్తలు, ఫాదర్లు, సిస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఫాదర్లను సత్కరిస్తున్న పీపీసీ సభ్యులు

ప్లాస్టిక్ పర్యావరణానికి హానికరం



పూర్ణామార్కెట్‌లోని చెరకు బండి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు హెచ్చరించారు. మంగళవారం జీవీఎంసీ 31, 35 వార్డుల్లోని జగదాంబ, పూర్ణామార్కెట్ వద్ద ఉన్న హోల్‌సేల్, రిటైల్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ అమ్మకాలు చేపట్టకూడదన్నారు. ప్రజల నుంచి కూడా స్పందన వస్తుందన్నారు. వ్యాపారులు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యాపారాలు మానుకోవాలన్నారు. జనవరి 1 వరకు కవర్లు పట్టుకుని సీజ్ చేస్తామన్నారు. ఫిబ్రవరి 1 తర్వాత నిషేధిత ప్లాస్టిక్ కవర్లు పట్టుకుంటే దుకాణాలు సీజ్ చేయడంతో పాటు అపరాధ రుసుము విధించి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, కామేశ్వరరెడ్డి మురళి, శ్రీను, ఆదినారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లీజుకు తీసుకుని తాకట్టు పెట్టిన వైనంపై విచారణ

మహారాణిపేట: సూపర్ బజార్ నుంచి లీజుకు తీసుకున్న కొంత భాగాన్ని తాకట్టు పెట్టిన సంఘటనపై విచారణ చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. దీనిపై సహకార శాఖ ఆడిటింగ్ ఆఫీసర్ శ్యామల విచారణ చేస్తున్నారని అన్నారు. నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

అందరి సహకారంతోనే సముద్ర తాబేళ్ల సంరక్షణ

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ శాఖలో పలు ప్రభుత్వ శాఖలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. తెగిపోయిన వలలు, తాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఒడ్డుకు తీసుకురావాలని అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, నెట్ ఫిష్ కోఆర్డినేటర్ హనుమంతరావు అవగాహన కల్పించారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తాబేళ్ల సంరక్షణలో భాగంగా చేపల వలల నుంచి సురక్షితంగా తప్పించుకోవడానికి వలల్లో టెడ్ పరికరాన్ని అమర్చి వేట సాగించాలన్నారు. సీఐఎఫ్‌టీ కొత్తగా తయారు చేసిన ఆ పరికరాన్ని ప్రదర్శించారు. విద్యుత్ దీపాల ద్వారా ఫిషింగ్ చేయరాదని, దీని వల్ల మత్స్య సంపద తగ్గిపోయే ప్రమాదం ఉందని ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ శ్రీధర్ అన్నారు. ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి మాట్లాడుతూ సముద్ర తీరంలో చిరిగిపోయిన వలలు, తాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల తాబేళ్లు, మత్స్య సంపదకు వాటిల్లే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కోస్టు గార్డు ప్రధాన అధికారి మహేష్ కుమార్, మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ, మర పడవల సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, సీహెచ్ వీర్రాజు, బి.కొండబాబు, ఎస్.నర్సింగరావు, ఎం.బాలాజీ, రాము, చిన్న, మత్స్యశాఖ ఏడీ విజయకృష్ణ, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఆషాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు